క్లుప్తంగా

ఉచితంగా ఎంసెట్ కోచింగ్

మద్దికెర: ఎంసెట్‌కు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు ఆపద్బాంధవ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సునీల్‌కుమార్ తెలిపారు. గుంతకల్లులోని శ్రీసాయి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఈనెల 27వ తేదీ నుంచి 45 రోజుల పాటు కోచింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మద్దికెర పరిసరాల ప్రాంతాల విద్యార్థులకు కోచింగ్‌తో పాటు ఉచితంగా మెటీరియల్ అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 9100024459 నంబర్‌కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

స్థలం కేటాయించాలని వినతి

మద్దికెర: మద్దికెరలోని సాయినగర్‌లో అంగన్‌వాడీ కేంద్రం నిర్మించేందుకు స్థలం కేటాయించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, చంద్రకళ తహసీల్దార్ రజాక్‌వలికి శనివారం వినతిపత్రం అందజేశారు. అధికారులతో మాట్లాడి స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

ఆస్పరి: మండలంలోని నగరూరు రైల్వే బ్రిడ్జి వద్ద శనివారం కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆస్పరి సీఐ హనుమంతప్ప తెలిపారు. ఆలూరు మండలం మూసనహళ్లి గ్రామానికి చెందిన బోయ ధనుంజయ, బోయ శేఖర్ మూసనహళ్లి నుంచి 13 బాక్సుల్లో 1248 టెట్రా ప్యాకెట్లను నగరూరు వైపు తీసుకొస్తుండగా వెంబడించామన్నారు. పోలీసులను చూసి రైల్వే బ్రిడ్జి సమీపంలో వదిలేసి పారిపోయారని తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశామని వెల్లడించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.

ఓటు వేయడం అందరి బాధ్యత

గోనెగండ్ల: ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని తహసీల్దార్ పార్వతి, ఎంపీడీఓ సోనిబాయి అన్నారు. నీ ఓటు– నీ భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా శనివారం అధికారులు, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులతో కలిసి మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

వెల్దుర్తి(కృష్ణగిరి): ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని పత్తికొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీఓ నీలపు రామలక్ష్మి అన్నారు. శనివారం వెల్దుర్తి మండల కార్యాలయం ఆవరణలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అనంతాచారితో కలిసి నీ ఓటు నీ భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓటర్లను చైతన్య పరిచేందుకు డ్వాక్రా సంఘాలు, ఎన్‌జీఓలు, మేధావులు, సంఘ సేవకులు ముందుకురావాలన్నారు. నియోజకవర్గంలో 57 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు గుర్తించి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో షోకాజ్ నోటీస్ జారీ చేసి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రిలీజ్, పంపిణీ తేదీలు ఎన్నికల కోడ్‌కు ముందు జరిగినట్లుగా వచ్చిన సమాధానం మేరకు సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఉన్నతాధికారులకు నివేదించి తదుపరి విచారిస్తున్నామని తెలిపారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ

తుగ్గలి: తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి 41 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మల్లికార్జున మాట్లాడుతూ.. తాళాలు వేసిన ఇళ్లు చూసుకుని చోరీలకు పాల్పడుతున్న తుగ్గలి మండలం రాంపల్లికి చెందిన బోయ అగ్రహారం రంగస్వామిని శనివారం ఏఎస్ జూనియర్ కాలేజీ సమీపంలో అరెస్ట్ చేసినట్లు చెప్పారు. తుగ్గలిలో ఓ కేసుకు సంబంధించి బంగారు గొలుసు, ఉంగరం, జత కమ్మలు, చిన్న పిల్లలకు చెందిన మూడు ఉంగరాలు, పత్తికొండ స్టేషన్ పరిధిలో ఓ కేసుకు సంబంధించి బంగారు గొలుసు, జత కమ్మలు, జత మాటీలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

రంగనాథుడికి వెండి పాదుకలు కానుక

మద్దికెర: రంగనాథస్వామికి అదే గ్రామానికి చెందిన శేషం రంగన్న రూ.50 వేలు విలువ చేసే అర కిలో వెండితో తయారు చేసిన పాదుకలను ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డిలకు శనివారం అందజేశారు.

ముగిసిన ఉత్సవాలు

ఆలూరు: మండలంలోని పెద్దహోతూరు, మరకట్టు గ్రామాల్లో కొలువుదీరిన ఉచ్చీరప్పతాత, సలువప్పతాత ఉత్సవాలు శనివారం వసంతోత్సవంతో ముగిశాయి. అంతకు ముందు విశేష పూజలు నిర్వహించారు.


కంకర తేలిన కాత్రికి గ్రామ రహదారి (నాడు)


కాత్రికి గ్రామానికి వేసిన సీసీ రోడ్డు (నేడు)


కంకర తేలిన గోనేహాల్ రహదారి (నాడు)


గోనేహాల్‌కు బీటీ రోడ్డు వేసిన తర్వాత (నేడు)

రోడ్లు మెరిసె.. పల్లె మురిసె

- మారిన గ్రామీణ రూపురేఖలు
- పల్లెదారులకు మోక్షం
- ప్రతి గ్రామంలో బీటీ, సీసీరోడ్ల నిర్మాణం
- ప్రయాణ కష్టాల నుంచి విముక్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

దశాబ్దాలుగా ఆ గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. గుంతలు పడిన మట్టి రోడ్డే దిక్కు. ఇక వర్షా కాలంలో పరిస్థితి చెప్పాల్సిన అవసరం లేదు. ఆటోలు, ఎద్దుల బండ్లు, ద్విచక్ర వాహనాలు, అత్యవసర సమయాల్లో 108 వాహనాలు వెళ్లాలన్నా కష్టంగా ఉండేది. రోడ్డు వేయండి మహా ప్రభో అని ప్రజా ప్రతినిధులకు వినతులు ఇచ్చినా పట్టించుకున్న పాపానపోలేదు. ఎన్నో ఏళ్ల కలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాకారం చేసింది. ఆస్పరి, ఆలూరు మండలాల్లోని పలు గ్రామాల్లో రోడ్ల నిర్మాణంతో ప్రయాణికులు, గ్రామస్తుల కష్టం తీరింది.

ఆస్పరి: గ్రామాలు అభివృద్ధి వైపు పరుగులు పెడుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఉన్న రోడ్డు సమస్యలు పరిష్కారమయ్యాయి. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలన్న సిద్ధాంతాన్ని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఫలితంగా ఐదేళ్లలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. సచివాలయాలు, ఆర్బీకేలతో పాటు ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, బీటీరోడ్లు వేయడంతో రూపురేఖలు మారిపోయాయి. ఆస్పరి మండలంలోని కలపరి, వలగొండ, పుటకలమర్రి, ముత్తుకూరు గ్రామాల ప్రజల నాలుగు దశాబ్దాల కల సాకారమైంది. ఈ గ్రామాలకు సీసీరోడ్లు వేసేందుకు ప్రభుత్వం రూ.3.94 కోట్లు మంజూరు చేసింది. కర్నూలు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి 700 మీటర్ల దూరంలో ఉన్న పుటకలమర్రి వరకు సీసీ రోడ్డుకు రూ.48.50 లక్షలు, కర్నూలు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి 800 మీటర్ల దూరంలో ఉన్న వలగొండ వరకు సీసీరోడ్డుకు రూ. 56 లక్షలు, కైరుప్పల క్రాస్ రోడ్డు నుంచి 1.08 కి.మీ దూరంలో ఉన్న కలపరికి సీసీరోడ్డుకు రూ. 1.34 కోట్లు, కర్నూలు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి 2.20 కి.మీ దూరం ఉన్న ముత్తుకూరు గ్రామంలోకి సీసీరోడ్డు నిర్మాణం కోసం రూ.1.56 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో పనులు పూర్తిచేయడంతో రవాణ సదుపాయం మెరుగైంది.





కర్నూలు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి వలగొండ గ్రామానికి వేసిన సీసీరోడ్డు


పుటకలమర్రి గ్రామంలో వేసిన సీసీరోడ్డు

ప్రగతి పరుగులు

ఆలూరు రూరల్: మండలంలోని కాత్రికి, హత్తిబెళగల్, అరికెర తండా, అంగస్కల్, గోనేహాల్, మూసానహళ్లి, ముద్దనగేరి గ్రామాలకే వెళ్లే రహదారులు పదేళ్లుగా కంకరతేలి అధ్వానంగా ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ, వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుంచి రూ.7.78 కోట్ల నిధులు మంజూరు చేయించి బీటీ, సీసీ రోడ్లు నిర్మించింది. రోడ్లకు మోక్షం లభించడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఇటీవలే నిర్మించిన హత్తిబెళగల్ రహదారి

ఇబ్బందులు తొలగాయి



కర్నూలు క్రాస్ రోడ్డు నుంచి మా గ్రామానికి వెళ్లేందుకు ఆటోలు, లారీలు, ద్విచక్రవాహనదారులు ఎంతో ఇబ్బందులు పడేవారు. రోడ్డు బాగు చేయించాలని అడిగినా ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 2.20 కి.మీ దూరం సీసీరోడ్డుతో పాటు నాలుగు కల్వర్టులను నిర్మించారు. ఎన్నో ఏళ్ల ఇబ్బందులు తొలగిపోయాయి.
–వేణుగోపాల్ ముత్తుకూరు, ఆస్పరి మండలం

నరకయాతన తప్పింది



ఆస్పరి మండలానికి మారుమూల ఉన్న మా గ్రామం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లాలంటే నరకయాతన పడేవాళ్లం. వర్షాకాలం అయితే పొలాలకు ఎద్దుల బండ్లు తీసుకెళ్లాలంటే భయమేసేది. పండించిన పంటను వాహనాల్లో పట్టణాలకు తీసుకెళ్లేందుకు ఎన్నో ఇబ్బందులు పడ్డాం. జగనన్న ప్రభుత్వం రోడ్డు వేసి మాకు కష్టాలు లేకుండా చేసింది. –గిడ్డయ్య, కలపరి, ఆస్పరి మండలం

సీసీరోడ్డుతో గ్రామానికి కళ



కర్నూలు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మా గ్రామానికి రూ.48.50 లక్షలతో సీసీ రోడ్డు వేశారు. సీసీ రోడ్డుతో మా గ్రామానికి కళ వచ్చింది. మారుమూల గ్రామాలకు సైతం సీసీరోడ్డు సౌకర్యం కల్పించిన జగనన్నకు రుణపడి ఉంటాం.
–దేవేంద్రయ్య, పుటకలమర్రి, ఆస్పరి

కల సాకారం



ఎన్నో ఏళ్ల గ్రామ రహదారి సమస్య తీరింది. గతంలో కంకర తేలిన రోడ్డులో ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉండేది. 10 నిమిషాల ప్రయాణం అరగంట పట్టేది. రాత్రిళ్లు ప్రయాణించాలంటే భయపడే వాళ్లం. ఇప్పుడు నిర్మాణం పూర్తి కావడం ఎంతో సంతోషంగా ఉంది.
–వీరభద్ర గౌడ్, కాత్రికి గ్రామం

ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తాం

- ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక అన్నారు. శనివారం పట్టణంలోని 21వ వార్డులో ఇంటింటి ప్రచారం చేశారు. ప్రతి గడపకు వెళ్లి జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వం రావాలని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి దుర్మార్గ పాలన సాగిస్తారన్నారు. ఆ పార్టీ నాయకులు మాయమాటలు చెప్పి మళ్లీ మోసగించేందుకు వస్తారని.. వారిని నమ్మి మంచి భవిష్యత్‌కు విఘాతం కలిగించుకోవద్దంటూ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, శాప్‌నెట్‌వర్క్ చైర్మన్ మాచాని వెంకటేష్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహ్మద్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యాకే రాజశేఖర్, వార్డు ఇన్‌చార్జ్‌లు మురహరి రాజశేఖర్, సయ్యద్‌చాంద్, నాయకులు బుట్టాశివనీలకంఠ, బుట్టా ప్రతుల్, బుట్టారంగయ్య, వీరేంద్ర, కౌన్సిలర్లు నాగేషప్ప, అంపమ్మ, వాహిద్, అమాన్, నీలకంఠ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి పరామర్శ

పట్టణంలోని శివన్న నగర్‌కు చెందిన మంగళి ప్రకాష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బుట్టా రేణుక స్థానిక ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.


ఎమ్మిగనూరు 21వ వార్డులో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న బుట్టా రేణుక


బుట్టా రేణుక సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నాగలదిన్నె వాసులు

అవ్వా పింఛన్ అందుతోందా?

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఎన్నికల ప్రచారం సందర్భంగా బుట్టారేణుక వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు. పింఛన్ అందుతుందా అవ్వా అంటూ అడిగి తెలుసుకున్నారు. ఒకటో తేదీ ఇంటి వద్దకే వలంటీర్ తెచ్చి ఇస్తున్నారని వృద్ధులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

బీజేపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

ఎమ్మిగనూరుటౌన్: నందవరం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు మాల రుద్రయ్య, జీవరత్నం, అంజి, రంజిత్‌కుమార్, ఈరన్న, ప్రవీణ్‌కుమార్ సహా 81 కుటుంబాలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ తిమ్మప్ప, ఎంపీటీసీ సభ్యుడు అథావుల్లా, మాజీ సర్పంచ్ ప్రభాకర్, నాయకులు శరత్‌కుమార్, లింగమూర్తి, బొంబాయిరాజు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సమక్షంలో చేరిన మహిళలు

అమకతాడు టోల్‌ప్లాజా వద్ద చోరీ

- మహిళ మెడలో బంగారు నగల అపహరణ

కృష్ణగిరి: అమకతాడు టోల్‌ప్లాజా వద్ద శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. టోల్‌ప్లాజాకు 50 మీటర్ల దూరంలో కారులో నిద్రిస్తున్న మహిళ మెడలోని బంగారు నగలను గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. అనంతపురం జిల్లా కదిరి పట్టణానికి చెందిన భార్యాభర్తలు ఫణిస్వామి, రామపెద్ది భాగ్యలక్ష్మి కారులో డ్రైవర్ ఫణీంద్రతో కలిసి హైదరాబాదులో గృహ ప్రవేశానికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. శనివారం తెల్లవారుజామున డ్రైవర్ నిద్రవస్తుందని చెప్పగా అమకతాడు టోల్‌ప్లాజా దాటి 50మీటర్ల దూరంలో కారు ఆపి నిద్రపోయారు. మూడున్నర గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి కారులో ఉన్న రాయపెద్ది భాగ్యలక్ష్మి మెడలోని బంగారు నగలను తెంపుకొని సమీపంలోని పొలాల్లోకి పారిపోయాడు. బాధితురాలు కేకలు వేయగా డ్రైవర్ దొంగను పట్టుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. తాళి బొట్టు గొలుసుతోపాటు బంగారు నెక్లెస్, నల్ల పూసల దండలు దాదాపుగా ఆరు తులాలు ఉన్నట్లు బాధితురాలు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కృష్ణగిరి ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కాగా టోల్ ప్లాజాకు ఇరువైపులా వంద మీటర్ల వరకు లైటింగ్ లేకపోవడం, సీసీ కెమెరాలు సరిగ్గా పనిచేయకపోవడం వల్లే దొంగతనాలు జరుతున్నట్లు తెలుస్తోంది.


సంఘటనా స్థలంలో విచారణ జరుపుతున్న కృష్ణగిరి ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి

సంతానం కలగలేదని ఆత్మహత్య


కృష్ణవేణి మృతదేహం

ఆలూరు రూరల్: సంతానం కలగలేదనే మనస్తాపంతో కృష్ణవేణి (28) అనే వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బళ్లారికి చెందిన కృష్ణవేణిని హాలహర్వి మండలం మెదేహాల్ గ్రామానికి చెందిన కృష్ణతో పదేళ్ల క్రితం వివాహం చేశారు. పదేళ్లవుతున్నా తనకు పిల్లలు కలగలేదని కృష్ణవేణి బాధపడుతూ ఉండేది. మనస్తాపంతో శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బంధువులు ఆమెను హాలహర్వి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆలూరు ఆస్పత్రికి రెఫర్ చేశారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

కట్టుదిట్టంగా ఎన్నికల నియమావళి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిరంజీవి
- సి–విజిల్, టోల్‌ఫ్రీ నంబర్ 08512–297300 ద్వారా ఫిర్యాదుల స్వీకరణ

ఎమ్మిగనూరురూరల్: కట్టుదిట్టంగా ఎన్నికల కోడ్‌ను అమలు చేస్తున్నామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిరంజీవి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల నిబంధనలను అన్ని రాజకీయ పార్టీలు, అధికారులు తప్పక పాటించాలన్నారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న 9 మంది వలంటీర్లను విధుల నుంచి తొలగించామని, అలాగే సొసైటీ ఉద్యోగిని సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారంపై ముందస్తుగా తమకు సమాచారం ఇవ్వాలన్నారు. జనసంచారం ఉండే ప్రాంతాల్లో జెండాలు, పోస్టర్లు, గోడ రాతలు ఉండరాదని తెలిపారు. అనుమతి లేకుండా ప్రచార వాహనాలను తిప్పితే సీజ్ చేస్తామన్నారు. సీ–విజిల్, టోల్‌ఫ్రీ నంబర్ 08512–297300కు వచ్చే ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. నియోజకవర్గంలో 12 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు పనిచేస్తున్నాయని, మండలానికి 4 టీంలు రోజు పర్యవేక్షిస్తున్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలు విత్‌డ్రా వరకు కొత్త ఓటరు నమోదు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఎమ్మిగనూరు, గోనెగండ్ల తహసీల్దార్లు శేషారెడ్డి, భూపతి పార్వతి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిరంజీవి, తహసీల్దార్ శేషారెడ్డి

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం


రామళ్లకోట నాయకులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ సమన్వయంతో పనిచేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం వెల్దుర్తి పార్టీ కార్యాలయంలో రామళ్లకోట నాయకులతో సమీక్షించారు. అందరూ కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ప్రభుత్వ మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నాయకులు కంగాటి రామ్మోహన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

గోనెగండ్ల: ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ శనివారం తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 28వ తేదీ నుంచి మే 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.150 ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. 10వ తరగతి మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారని తెలిపారు. వివరాలకు గోనెగండ్ల ఏపీ మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని సూచించారు.

నందవరం: మండల పరిధిలోని ముగతి మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ చంద్రశేఖర్ అన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు https://apms.apcfss.in లేదా https://cse.ap.gov.in వైబ్‌సెట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న దరఖాస్తు కాపీని కళాశాలలో అందజేయాలని కోరారు.

శేష వాహనంపై శ్రీరంగనాథుడు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో కొలువుతీరిన శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి సతీసమేతుడై శనివారం శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శేషోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


శేషవాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

టీడీపీకి ఓటేస్తే సంక్షేమం దూరం

- వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి చిప్పగిరి విరుపాక్షి

హొళగుంద: వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటేస్తే ఇప్పుడు వస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి నిలిచిపోతుందని వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి చిప్పగిరి విరుపాక్షి అన్నారు. శనివారం సుళువాయి, ముగు మానుగుంది, ముద్దటమాగి, సమ్మతగేరి గ్రామాల్లో పర్యటించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. చంద్రబాబు గతంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని.. రైతులు, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి విస్మరించారని.. ఆయన్ను నమ్మి మరోసారి మోసపోవద్దని కోరారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని.. మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఇలానే కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేసి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నానని తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు శేషప్ప, ఈశా, ఎంపీటీసీలు మల్లికార్జున, కెంచప్ప, సర్పంచ్ మౌలాలి, హసనప్ప, వన్నూరుసాబ్, ఎస్కే గిరి, రవిస్వామి, రామకృష్ణ, సిద్ధయ్య పాల్గొన్నారు.


ముద్దటమాగిలో మహిళలతో మాట్లాడుతున్న చిప్పగిరి విరుపాక్షి

ఎన్నికల ప్రచారానికి అనుమతి తప్పనిసరి

ఆలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచారాలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఆలూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ రాము నాయక్ అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో 8 విభాగాల నోడల్ ఆఫీసర్లతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సింగిల్ విండో పర్మిషన్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచారానికి 48 గంటల ముందు ఆన్‌లైన్, సువిధా యాప్ లేదా నేరుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అర్జీ దాఖలు చేయాలన్నారు. విచారించి 24 గంటల్లో అనుమతి లేదా తిరస్కరణ చేస్తామని పేర్కొన్నారు. అనుమతి పొందని అభ్యర్థులపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద చర్యల తీసుకుంటామని తెలిపారు.

అభ్యర్థులు తీసుకోవాల్సిన అనుమతులు

బహిరంగ సమావేశాలు, ఇంటింటి ప్రచారం, తాత్కాలిక పార్టీ కార్యాలయం ఏర్పాటు, అభ్యర్థులు ప్రయాణించే వాహనాలు, ఊరేగింపు, మీటింగ్ స్టేజ్, ర్యాలీలు, కరపత్రాల పంపిణీ, బ్యానర్లు, హోర్డింగ్‌ల ఏర్పాటు, పార్లమెంట్ అభ్యర్థి వాహనం, లౌడ్ స్పీకర్లు అమర్చిన వాహనాలకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.